# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్‌రాజు





## – 19 –

## అమెరికాస్టింగ్ కౌచ్ కథ కాని ఛానెల్ కట్టుకథ

**ఇంచుమించు** ముఫ్ఫై ఏళ్ల క్రితం ఓ రోజు మా హ్యూస్టన్ లో ఒకానొక కోర్టు వారి నుండి “ఫలానా రోజున ఉదయం 8 గంటలకు తమరు జ్యూరీ డ్యూటీలో ఎంపిక నిమిత్తం ఎంపిక చేయబడినారు అని మీకు తెలియజేస్తున్నాం. అమెరికా న్యాయ సూత్రాల ప్రకారం మీరు వెర్రి వెధవ కారణాలు చెప్పి తప్పించుకోడానికి వీలు లేనందున సదరు తేదీ నాడు సదరు కోర్టుకి విధిగా వచ్చి తీరవలయును అని ఈ సమన్లు మీకు జారీచేయడం అయినది.” అని ఒక ఉత్తరం వచ్చింది. వారు చెప్పినది నిజమే. ఆ ఉత్తరం నాకు అందలేదు అనీ, మా ఇంట్లో కుక్క పిల్ల అంత్య క్రియలు అనీ, జొరం అనీ, కడుపు నొప్పి వచ్చిందీ అని అడ్డమైన వంకలూ పెట్టి జ్యూరీ డ్యూటీ ఎగ్గొట్టడానికి అమెరికాలో కుదరదు. ఆ రోజు ప్రైవేటు ఆఫీసులలో కూడా ఆ పౌరుడికి శలవు ఇచ్చి తీరాలి. రేపో, ఎల్లుండో బాల్చీ తన్నే పరిస్థితిలో ఉన్నప్పుడో, మరొకటి రెండు అతి ముఖ్యమైన మానవతా కారణాలకి తప్ప ఈ జ్యూరీ డ్యూటీకి అమెరికా పౌరులైన వారిని సుమారు 500 మందిని ఒకసారి పిలుస్తారు. వారిలో పెద్ద కంపెనీల అధ్యక్షుల దగ్గర నుంచీ మా ఇంటి గడ్డి కట్ చేసే ఫెర్నాండేజ్ దాకా ఎవరైనా ఉండవచ్చును, ప్రతీ పౌరుడూ ఎటువంటి భావజాలం వారు అయినా ఉండవచ్చును. అందులో ఆయా కేసులకి సంబంధించిన ఇరు పక్షాల న్యాయవాదులు, తమ కేసులో ఎవరి పక్షాన నిర్ణయం తీసుకునే అవకాశం ఉండే అవకాశం ఉంది అని ఊహించుకుని ఆయా వ్యక్తులతో మాట్లాడతారు. ఎందుకంటే ఇరుపక్షాల వారు సమానంగా ముగ్గురి నుంచి ఆరుగురు దాకా జ్యూరీ సభ్యులని ఎంపిక చేసుకుంటారు. ఈ తతంగంలో జ్యూరీ డ్యూటీకి పిలవబడిన 500 మందిలో ఎంపిక అవడం అంత సులభం కాదు. ఈ ప్రక్రియ పోలీసుల ప్రమేయం ఉన్న క్రిమినల్ కేసులకి పరిమితం. ఆశ్చర్యం ఏమిటంటే అమెరికా పౌరుడిగా మీరు ఓటు వెయ్యకపోయినా పరవాలేదు కానీ జ్యూరీ డ్యూటీ చెయ్యక పోతే చట్టరీత్యా నేరం కాబట్టి శిక్ష పడుతుంది. పైగా పోలీసుల బాధ్యత పబ్లిక్ ప్రాసిక్యూటర్ ద్వారా నేరం, ఆరోపించడం, నిరూపించడానికి ప్రయత్నించడం మాత్రమే. అందరి వాదాలూ విని నేరం జరిగిందా లేదా నిర్ణయం మాత్రమే....దోషి –నిర్దోషి..అంతే జ్యూరీ చెయ్యాల్సిన పని. అది కూడా ఏకగ్రీవంగానే జరగాలి. మెజారిటీ నిర్ణయం కాదు. జడ్జీ గారు దానికి శిక్ష విధిస్తారు. ఇదీ పద్ధతి. అలా అని అన్ని కేసులకీ జ్యూరీలు ఉండవు.

ఏమైతేనేం, ఆ రోజు నేను జ్యూరీ డ్యూటీ కి ఎంపిక అయ్యాను. అంతే కాదు. ఆ ఆరుగురు జ్యూరీ పానెల్ కి చైర్మన్ గా కూడా నన్ను ఎన్నుకున్నారు. అదీ అమెరికా అంటే. ఎక్కడో కాకినాడ నుంచి వలస వచ్చిన నన్ను ఇద్దరు నల్ల మహిళలు, ఒక మెక్సికన్, ఒక చైనా అమ్మాయి, ఒక తెల్లాయన ఉన్న ఆ జ్యూరీ పానెల్ కి నన్ను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అనేదే అమెరికా ప్రజాసామ్యం అంటే! ఒకానొక నైట్ క్లబ్ లో డాన్సర్ నిబంధనలకి విరుద్ధంగా అశ్లీలంగా ప్రవర్తించిందా లేదా ఆ రోజు విచారణకి వచ్చిన కేసు. అంటే క్రైమ్ డిటెక్టివ్ ఒకడు

మామూలు బట్టలలో ఒక అనామిక కష్టమర్ గా ఆ క్లబ్ కి వెళ్లి, ఆ అమ్మాయితో మాటలు కలిపి, ఉచ్చులో వేసి అరెస్ట్ చేసి ఈ కేసు పెట్టాడు. సరదాగా ఆ ఫోటోలు, వీడియోలు చూపిస్తారేమో అని మాలో కొందరు కుతూహల పడినా వారిని నిరుత్సాహ పరుస్తూ వాదోపవాదాలు జరిగాక జడ్జీ గారు మమ్మల్ని మా నిర్ణయం కోసం అని జ్యూరీ గది లోకి పంపించారు. ఇక్కడ విశేషం ఏమిటంటే ఆ గదిలో మేము తప్ప ఇంకెవరూ ఉండరు. ఒక్క కాగితం ముక్క ఉండదు. ఆ కేసుకి సంబంధించిన దస్తావేజులు, ఫోటోలు, వీడియోలు అడిగి తెప్పించు కోవచ్చును. ఏక గ్రీవ నిర్ణయం వచ్చే దాకా ఎన్ని గంటలయినా, రోజులయినా, నెలలు అయినా పట్ట వచ్చును. రోజుకి ఏకంగా పన్నెండు డాలర్లు వేతనం ఇస్తారు. అంటే అంత తక్కువ అని తాత్పర్యం. మా దగ్గర ఉన్న కేసులో కాగితాలూ లేవు, లీగల్ పాయింట్లూ లేవు, ఫోటోలు, వీడియోలు అంత కన్నా లేవు. ఉన్నదల్లా అమాయకంగా ఉన్న ఆ అమ్మాయిని నమ్మడమా లేక మారు వేషంలో వెళ్ళిన పోలీసుని నమ్మడమా అనేదే మా ఆరుగురికీ ఉన్న సమస్య. పాపం ఆ అమ్మాయి నాలుగు డబ్బులు సంపాదించుకోడానికి డాన్సులతో తన ఉద్యోగం చేసుకుంటే తప్పేమిటీ అని కొందరూ, అయితే మటుకు మగాడితో పబ్లిక్ గా తప్పు కదా అని కొందరూ, అసలు ఆ పోలీసు అలా దొంగలా వెళ్ళడం లా ప్రకారం కరక్ట్ కాదు కదా. అతను పోలీసు అని తెలిస్తే ఆ అమ్మాయి అతడితో పబ్లిక్ శృంగారం చేసేది కాదు కదా అని కొందరూ, ఇలా గంటల తరబడి మాట్లాడుకున్నాక..కొట్లాడుకో లేదు..మాట్లాడుకోవడమే...ఏకగ్రీవ అభిప్రాయం రాలేదు. ఆఖరికి చైర్మన్ గా నేను ఏది నిర్ణయిస్తే అదే ఒప్పుకుంటాం అని రెండో రోజు మధ్యాహ్నం సమయానికి అందరూ ఒప్పుకున్నారు. అలా మా సమిష్టి నిర్ణయాన్ని మా జడ్జీ గారికి చెప్పగానే అది ఒప్పుకోని లాయర్ గారు మాకు ముందు తెలియని ఒక మహాస్త్రం వేశాడు..అదేమిటీ అంటే.."ఏ జ్యూరీ సభ్యులు ఏ పక్షాన ఓటు వేశారు అనే సంఖ్యా బల నిరూపణ కావాలి" అని జడ్జీగారు అడిగారు. ఆయన మాలో ఒక్కొకరినీ అడగ్గానే మాది ఏకగ్రీవ నిర్ణయం కాదు అని తేలిపోగానే కేసు కొట్టేశారు. అందరూ నవ్వుకుంటూ హాయిగా ఇంటికి వెళ్ళిపోయారు...ఆఖరికి ఆ డాన్సర్ అమ్మాయి, ఆ డిటెక్టివూ కబుర్లు చెప్పుకుంటే వెళ్ళిపోతున్న ఆహ్లాదకరమైన దృశ్యం కూడా నా కంట బడి, అమెరికా పౌరుల సౌహార్ద్ర హృదయాల పట్ల మరొకసారి ఆశ్చర్య పోయాను.

ఇదంతా ఇప్పుడు ఎందుకు జ్ఞాపకం వస్తోందీ అంటే...మన ఇండియాలో జ్యూరీ అంటే టీవీ లలో వచ్చే చర్చా వేదికల నిర్వాహకులు, అందులో పాల్గొనే వారు, పత్రికలలోవార్తలు వ్రాసేవాళ్లే. అసలు కేసు ఏమిటో తెలియకుండానే వీళ్ళు తీర్పు ఇచ్చేస్తారు. ఉదాహరణకి ఇప్పుడు హోరుమని ప్రచారం సాగుతున్న అమెరికాలో తెలుగు తారలతో దేహ వ్యాపారం కేసు సంగతే తీసుకోండి. అమెరికాలో FBI వారు తమకు వచ్చిన రెండు ఫిర్యాదుల ఆధారంగా ఒక కేసు నమోదు చేసి, ఆరు నెలల పైగా విచారణ చేసి, ఆ వివరాలు హోమ్ లాండ్ సెక్యూరిటీ వారికి ఇవ్వగా వారు కోర్టులో కేసు నమోదు చేసి ఆ నిందితులని అరెస్ట్ చేశారు. అది జరిగి రెండు నెలలు అయింది. అంటే గత ఎనిమిది నెలలుగా ఈ విచారణ జరుగుతున్నప్పటికీ, అరెస్ట్ అయి రెండు నెలలు అయినప్పటికీ మన పాత్రికేయ ప్రబుద్ధులకీ, టీవీ వారికీ ఏమీ తెలియదు. ఒక అమెరికా పత్రిక ప్రకటించిన వార్త ద్వారా తెలిశాక..ఓరి నాయనోయ్...ఏ చానెల్ చూసినా అదర గొట్టే, పగల గొట్టే వార్తలే. బ్రేకింగ్ న్యూస్ పేరిట అంతా పగల గొట్టడం, విరగ్గొట్టడం..అన్నింటి కన్నా అన్యాయం అసలు కేసు వదిలేసి, అభియోగం పక్కన పెట్టేసి ....ఇలాంటి వ్యాపారం అమెరికా సాంస్కృతిక సంస్థలు అన్నీ ఎప్పటి నుంచో చేస్తున్నట్టూ, ఏదో ఈ సారి దొరికిపోయారు అన్నట్టూ ఒకటే ఊక దంపుడు. ఒక సినిమా ప్రముఖుడు మరీ అన్యాయంగా "మేము తల్లిదండ్రులుగా ఎంతో కష్టపడి చదువు చెప్పించి అమెరికా పంపిస్తే ఇలాంటి పనులు చెయ్యడానికి అమెరికా సంఘాలు, నిర్వాహకులు ఎంతో సిగ్గు పడాలి" అని తను సిగ్గు పడాల్సిన వ్యాఖ్యలు చేశాడు. ఇక ఇతర సినీ ప్రముఖ కుటుంబాలు సిగ్గుపడి అసలు ఈ విషయం గురించి మాట్లాడ లేదు

ఇదే కేసు గనక తెలుగు నాట జరిగి ఉంటే.. రెండు రకాల కేసులు జరుగుతాయి...జరగవు..

ఒకటేమో ..ముందు ఆ దంపతుల మీద అభియోగం రాగానే (విచారణ అక్కర లేదు..కేవలం కంప్లైంట్ చాలు..) ఒక పెద్ద పోలీసు, పక్కనే మరో నలుగురు ఖాకీ దుస్తులవారు, ఆ దంపతులిద్దరూ మొహాలు కనపడకుండా గుడ్డలు కట్టుకుని ఉండగా పది మంది టీవీ వాళ్ళతో పెద్ద భేటీ జరుగుతుంది. ఎంత కష్టపడి వారు ఈ కేసు ఎలా ఛేదించి నిందితులని పట్టుకున్న తమ ఘనకార్యం వివరించి చెప్తారు. ఆ తర్వాత ఆ కేసు ఏమైనదీ ఎవరికీ తెలియదు. అంతా మర్చిపోతారు.

ఇక రెండో రకం....ఆ దంపతులు బాగా పరపతి, డబ్బూ ఉన్న రాజకీయ నాయకుల తాలూకో, సినిమా వారో అయితే ఆ అభియోగం అందుకున్న ఆ పెద్ద పోలీసు కొనుక్కోబడతాడు, లేదా శంకరగిరి మాన్యాలకి బదిలీ చెయ్యబడతాడు. ఇక అంతా గప్ చిప్. కేసూ లేదు. గాడిద గుడ్డూ లేదు.

ఈ కేసు అమెరికాలో జరిగింది కాబట్టి ఆ పప్పులేం ఉడకవు. మన తెలుగు టీవీ చానెల్ వారు ఎవరూ ఆ FBI ఆఫీసర్ తో ఇంటర్వ్యూ తీసుకున్న ..కనీసం సెల్ఫీ తీసుకున్న దాఖలాలు లేవు. జడ్జీ ముందు దాఖలు అయిన దావా కాగితాలు తప్ప ఇంకేమీ ఎవరికీ తెలియదు. ఇక ఈ దావాలో FBI వారు ఆ సినిమా తారలని బాధితులుగా గురించి వాళ్ళ పేర్లు ప్రకటించక పోవడంతో మన ఇండియా టీవీ వారికి అతి గొప్ప సంచలన వార్తలు వేసే అవకాశం ప్రస్తుతానికి తప్పి పోయి గిజగిజ లాడిపోయారు. అది భరించ లేక, అసలు కేసు గురించి ఏమీ మాట్లాడ లేక మాజీ తారలని, అమెరికా అవకాశాలు ఎక్కువగా రాక ఆక్రోశించే వారినీ చర్చలకి తీసుకొచ్చి అమెరికా సంఘాలని తిట్టడానికి, చెయ్యని నేరాలకీ, చేస్తున్న పనులలో లోపాలకీ సంజాయిషీ అడగడం అతి పెద్ద కార్యక్రమం అయిపోయింది.

ఇంతకీ జరిగిన విషయం ఏమిటీ అంటే ఆ నిందితులు వీసా ఉల్లంఘనలు ఉల్లంఘించి అమెరికాలో ఉంటున్న దంపతులు అనేది మొదటి అభియోగం. అంతేకాక సినీ తారలకి దొంగ వీసాల కోసం కనీసం రెండు అమెరికా సంస్థల ఆహ్వానాలు ఫోర్జరీ చెయ్యడం. ఇక్కడ నిజంగా బాధితులు ఆ సంస్థలు అయితే అది వదిలి పెట్టి అమెరికా సంస్థలు అన్నీ అవకతవక పనులు చేస్తున్నాయని చెప్పడానికి, చెప్పించడానికీ ప్రయత్నించడం అన్ని చానెల్స్ వారూ చేస్తున్న ఘోరమైన తప్పిదం. మొత్తానికి చాలా మంది టీవీ వారు ఎప్పుడెప్పుడు ఏయే సినీ తారల పేర్లు, అమెరికా తెలుగు సంఘాల నాయకుల పేర్లూ, తద్వారా వారి వారి రాజకీయ అనుబంధాలతో ఇక్కడి వారి పేర్లూ బయటకు వస్తాయా, ఎప్పుడు వీరంగం చేద్దామా అని గోతి దగ్గర నక్కల్లాగా కాచుకుని కూచున్నట్టు గా అనిపిస్తోంది.

ఈ కేసు విచారణ మొదలు అయ్యాక పేర్లూ, సంఘటనలూ బయటకు వచ్చాక కానీ అమెరికా సంఘాల పాత్ర ఏమన్నా ఉందా, లేదా అనేది తెలియదు. అంత వరకూ టీవీల వారూ, పాత్రికేయులూ, అమెరికా వచ్చినప్పుడు నిరాశా నిస్పృహలకి గురి అయిన వర్ధమాన తారలు, అవకాశాలు రాని కళాకారులు, గ్లామర్ తగ్గిన తారలు, ఆవేశం ఎక్కువా అవగాహన తక్కువా ఉన్న మహిళా సంఘాల నేతలు కొందరు,..ఒకరేమిటి....అందరూ తమ ఊహాగానాలకి, కొండొకచో దురూహాగానాలకి రెక్కలు కట్టి దశాబ్దాలుగా అన్ని రంగాలలోనూ మంచి కృషి చేస్తున్న అమెరికా తెలుగు సంఘాలే ఇలాంటి అఘాయిత్యాలకు కారణం అని బురద జల్లే ప్రయత్నం చెయ్యడం సమంజసం కాదు.

నాకు తెలిసీ ఈ కేసులో మొదటి భాగం ఆ కిషన్ దంపతుల అమెరికా వీసా న్యాయ సూత్రాల ఉల్లంఘన. అనగా...ఇచ్చిన వీసా అయిపోగానే వెనక్కి వెళ్ళిపోకుండా తప్పుడు గ్రీన్ కార్డ్ పత్రాలు సృష్టించి అమెరికాలోనే ఉండిపోవడం చట్ట రీత్యా చాలా పెద్ద నేరం. అలా దొరికిన వారికి ఇమ్మిగ్రేషన్ చట్టాల క్రింద తగిన శిక్ష వేసి వెంటనే వెనక్కి ఇండియా పంపించేస్తారు. ఇక వాళ్ళు నిర్వహించిన దేహ వ్యాపారం క్రిమినల్ నేరం. కానీ బాధితులు ఇండియా పౌరులైన సినీ తారలు. వారిని ఇక్కడ విచారించే అవకాశం లేదు కాబట్టి ఈ వ్యభిచారం కేసు ఇండియాకి పంపించి అమెరికా పోలీసు తమ సహకారం అందించడం తప్ప ఇంకేమీ చెయ్యరు అని నేను అనుకుంటున్నాను. అనగా....ఈ కేసు ఇండియా వెళ్తుంది. ఇంకేముందీ...ఊష్ కాకీ...తుస్సుమని గాలిలోకి ఎగిరిపోయే అవకాశం చాలా ఉంది. ఎందుకనగా ఇందులో ఉన్న నిందితులు, బాధితులు లైన ఒకరిద్దరు హీరోయిన్లు, సినీ తారలు, ఏంకర్లు బహుశా సినీ రంగంలో పరపతి కలవారే అయి ఉంటారు. అలాగే

డబ్బున్న అమెరికా తెలుగు విటులకి ఇండియాలో వారి వారి రాజకీయ పరపతులు ఎలాగా ఉంటాయి. అందువల్లనే ఈ కేసు ఇండియాకి తరలిస్తే అంతా మటుమాయం అయిపోయే అవకాశాలు చాలా ఉన్నాయి.

ఏది ఏమైనా...ఈ కేసులో జ్యూరీ ఇంకా సమావేశం అవనే లేదు. ఇమ్మిగ్రేషన్ & దేహ వ్యాపార నేరాల నిర్ణయం రానే రాలేదు. బాధితులు అందరూ బాధితులేనా, వారిలో కూడా నిందితులు ఉన్నారా అనేది ఇంకా తేలనే లేదు. కేసు నమోదు అయింది కానీ విచారణ మొదలు అవనే లేదు. కేవలం రెండు సంస్థల పేరిట జరిగిన ఫోర్జరీ తప్ప అమెరికా తెలుగు సంఘాలకీ , ఈ కేసుకీ ఏమీ సంబంధం లేదు. నేను గత కొన్ని వారాలలో ఈ చానెల్స్ లో పదే, పదే వింటున్న సరి కొత్త మాటలు విత్ కమిట్ మెంట్, విత్‌ఔట్ కమిట్ మెంట్, విత్ పాకేజ్, విత్‌ఔట్ పాకేజ్, షాపింగ్ లాంటివి మా అమెరికా సంఘాలకి అన్వయించవు.

ఇవన్నీ ఎలా ఉన్నా అమెరికా పత్రిక అయిన చికాగో ట్రిబ్యూన్ లో ఈ వార్త ప్రచురించే దాకా కళ్ళు మూసుకున్న ఈ తెలుగు టీవీ చానెల్స్ మరియు పత్రికా మాధ్యమాల వారూ మాకు నీతులు చెప్పడం హాస్యాస్పదం. సిగ్గులేని తనం.

అమెరికా తెలుగు సంఘాల నాయకులు, ముఖ్యంగా జాతీయ సమావేశాల సాంస్కృతిక విభాగాల సభ్యులు దేహ వ్యాపారం ప్రాతిపదికగా ఇండియా సినీ తారలని, ఇతర కళా కారులనీ ఎంపిక చేస్తారు అనే అభియోగం ఆ ఆరోపణ చేసే వ్యక్తుల మానసిక దౌర్భాగ్యం తప్ప ఇంకేమీ కాదు.

మా తెలుగు సంఘాలలో కుల ప్రభావంతో సహా మరింకేమైనా ఉండవచ్చును. కానీ అమెరికాస్టింగ్ కౌచ్ అనేది లేనే లేదు. తెలుగు సంస్కృతి ముసుగులో అమెరికాలో వ్యభిచార వ్యాపారం ప్రసక్తే లేదు. ఈ వ్యాసం వ్రాసే సమయానికి అందిన సమాచారం ప్రకారం మాజీ జ్యూరీ చైర్మన్ గా ఇదే నా తీర్పు.

**COMMENTS**